క్లుప్తంగా

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం


గోదాదేవి సమేత రంగనాథస్వామి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని బజారు వీధిలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం గోదాదేవి సమేత శ్రీరంగనాథ స్వామి కల్యాణం జరిగింది. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వేదపండితులు పూజలు నిర్వహించారు. గోదాదేవి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సింహ వాహనంపై గౌరమ్మ


పురవీధుల్లో ఊరేగుతున్న గౌరమ్మ

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం శాస్త్రోక్తంగా పంచ మూర్తుల పల్లకి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం గొబ్బెమ్మ అమ్మవారిని అలంకరించి సింహ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుర ఉత్సవం


పుర వీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి పుర ఉత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అంతకు ముందు గిరి ప్రదక్షిణలో భాగంగా స్వామి అమ్మవార్లకు ఎదురుసేవ మండపం వద్ద కొలువుదీర్చారు. పూజల అనంతరం స్వామి అమ్మవార్లను ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రాలు , మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేశారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రజలు బారులు తీరారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కడూరు మాజీ సర్పంచ్ మృతికి నివాళి


మునస్వామి (ఫైల్)

వరదయ్యపాళెం : మండలంలోని కడూరు పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మునస్వామి (67) బుధవారం సాయంత్రం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేసి నివాళి అర్పించారు.

తమిళనాడు యువకుల హల్‌చల్


కారు టాప్‌పై కూర్చుని హంగామా చేస్తున్న యువకులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు-సత్యవేడు రోడ్డు మార్గంలో తమిళనాడుకు చెందిన కొందరు యువకులు బుధవారం సాయంత్రం హల్‌చల్ చేశారు. కారు రూఫ్‌టాప్‌పై నిలబడి గోల చేస్తూ హంగామా సృష్టించారు. వెనుక వస్తున్న వాహనాలకు దారి ఇవ్వకుండా వేధించారు. ఆ దృశ్యాలు సైతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఆ యువకులపై చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


గ్రామోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి


పశువుల ప్రత్యేక అలంకరణ


సత్యవేడు : ఇరుగుళంలో గొబ్బి ఆడుతున్న మహిళలు

పశువుల పండుగను రైతులు, కూలీలు, మహిళలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ మరుసటి రోజు పశువుల పండుగను నిర్వహించడం ఆనవాయితీ. రైతులు ఉదయం నుంచి పశువులను గ్రామ సమీపంలోని చెరువులు, కొలనులు, గుంతల వద్దకు తీసుకెళ్లి శుభ్రం చేసి వాటికి రంగులు, కుంకుమ బొట్లు పూలు, హీరోల పోస్టర్లు , దేవుళ్ల ఫొటోలతో అలంకరించారు.

మురిసిన పల్లె

- వైభవంగా సంక్రాంతి సందడి
- రైతు పండుగ జోష్
- కిక్కిరిసిన ఆలయాలు

సత్యవేడు : నియోజకవర్గంలో ఇంటి వాకిట కొత్త కుండలో చక్కెర పొంగలి పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. కనుమనాడు రకరకాల పిండి వంటలు చేసుకుని బంధువులతో ఆనందాన్ని పంచుకొన్నారు.

ఊరు చివర బొమ్మరిల్లు

పశువుల కాపరి పశువులను పూజించేందుకు ఊరి చివర బొమ్మరిళ్లు కట్టారు. సాయంత్రం రైతులు పశువులను అక్కడికి తీసుకెళ్లి పూజలు చేశారు. కాపరి పసుపు నీటిని గోవులు, ఎద్దులపై చల్లారు. అనంతరం పెద్ద శబ్దాలు చేస్తూ ఎద్దులను ఇళ్లకు తరిమారు. ముందుగా తమ ఎద్దులు వెళ్లాలని యువకులు పోటీ పడి పశువులను పరుగులు పెట్టించారు.

పేడ కోసం పోటీ

పశువుల కాపరి పశువుల పండుగ రోజున పేడ, తంగేడు ఆకులు ,పూలు కలిపి కట్టిన బొమ్మరిల్లు పేడను తీసుకుపోయేందుకు రైతులు పోటీ పడ్డారు. బొమ్మరిల్లు కట్టిన పేడను తమ పశువుల పాకలో ఉంచుకోవడం ఇక్కడి ఆనవాయితీ.

సత్యవేడు నియోజకవర్గంలో మూడు రోజుల సంక్రాంతి సంబరాలు పల్లెల్లో అంబరాన్నంటాయి. ఇంటింటా పిండి వంటలు, కొత్త అల్లుళ్లు, కోడళ్లతో పాటు యువతీ యువకులు సంప్రదాయ వస్త్ర ధారణలతో సందడి చేశారు. ఇంటింటా వాకిళ్లలో వేసిన రంగవల్లికలు, గొబ్బెమ్మల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టింది. పిల్లలు, పెద్దలు, మహిళలు పాల్గొనడంతో ఈ వేడుకలు కోలాహలంగా సాగాయి.

సత్యవేడు : మండలంలోని ఇరుగుళం అంకాలమ్మ ఆలయం సంక్రాంతి వేడుకలకు వేదికయింది. బుధవారం ఆలయ ప్రాంగణంలో సామూహిక గొబ్బెమ్మ పూజలు ఆనందాల నడుమ జరిగాయి. మిత్రుల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలతో యువకులు సందడి చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో సంక్రాంతి, కనుమ పండుగ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం పశువులకు, గొబ్బెమ్మకు పూజలు చేశారు.

వరదయ్యపాళెం : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పితృదేవతలకు తర్పణాలను వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బుధవారం ఊరూరా పశువుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. కళత్తూరులో పార్వేటి ఉత్సవం వైభవంగా జరిగింది. గ్రామ పురవీధుల్లో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

> **పూజిస్తే పాడి వృద్ధి**
>
> గోవు పేడతో బొమ్మరిల్లు కట్టి పశువులను పూజిస్తే పశువులు బాగా వృద్ధి చెందుతాయనే నమ్మకం. మా తాత ముత్తాతల నుంచి ఇలా చేస్తున్నాం. ఆచారాలను వదిలేయకుండా కొనసాగిస్తూ వస్తున్నాం.ఆవులను కుటుంబ సభ్యుల లాగా చూసుకుంటాం. పేదలమైన మాకు గోవులే జీవనాదారం. అందుకే ఏటా ఈ ఆచారం తప్పకుండా చేస్తున్నాం.
>
> **- గోవిందస్వామి, కాళమనాయుడుపేట.**

> **గోవులు ఆరోగ్యంగా ఉంటాయని**
>
> పశువుల కాపరి పేడతో కట్టిన బొమ్మరిల్లులో గోవులకు ఆరోగ్యంగా ఉండాలని పూజ చేస్తారు. ఆ పేడ గోవుల పాకలో ఉంచుకొంటే గోవులు ఆరోగ్యంగా ఉంటాయని మా నమ్మకం. ఏటా ఇలా పేడ తీసుకెళ్లి ఉంచుకొంటున్నాం. మా పశువులు ఆరోగ్యంగా ఉన్నాయి. ఈ పేడతో ఎలాంటి వ్యాధులు గోవులకు సోకకుండా ఉంటోంది. అందుకే ఈ పేడ కోసం పోటీపడుతారు.
>
> **- రాజ, కాళమనాయుడుపేట**


వరదయ్యపాళెం : గొబ్బి ఆడుతున్న మహిళలు


బొమ్మరిల్లు వద్దకు ఎద్దులను తీసుకొచ్చిన రైతులు


సత్యవేడు : స్నేహితుల ఆత్మీయ సమావేశం

ముక్కంటిని మరిచి..నేతలనే కొలిచి !


చెట్లకు కట్టిన రాజకీయ ఫ్లెక్సీలు



- గిరి ప్రదక్షిణ రోడ్డులో రాజకీయ ఫ్లెక్సీలు
- భక్తుల మండిపాటు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన గిరి ప్రదక్షిణ రోడ్డు పొడవునా టీడీపీ నాయకుల ఫ్లెక్సీలే దర్శనమిచ్చాయి. స్వామి, అమ్మవార్లకు స్వాగతం పలకాల్సిన గిరి ప్రదక్షిణ రోడ్డులో ఎమ్మెల్యేకు స్వాగతం పలికే విధంగా టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లకు ఈ ఫ్లెక్సీలు కట్టడంతో చెట్లు విరిగిపోయే ప్రమాదం ఉంది. అవేమీ పట్టని తెలుగుదేశం నాయకులు విచ్చలవిడిగా ఫ్లెక్సీలను చెట్లకు వేలాడదీశారు. గతంలో స్వామి వారికి స్వాగత బ్యానర్లు వేసిన దానికే రాద్ధాంతం చేసి ఆధ్యాత్మికత లోపించిందంటూ ఉపన్యాసాలు దంచారు. టీడీపీ నాయకుల తీరు ఇతరులకు నీతులు చెప్పడానికే కానీ తమకు కాదు అన్నట్లుంది వీరి వ్యవహారం. రాజకీయ ఫ్లెక్సీలపై పట్టణంలో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జర్నలిస్టుల పాసులపై అవగాహన లేని కండక్టర్లు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ అధికారులు జర్నలిస్టులకు మంజూరు చేస్తున్న బస్ పాసులపై కొందరు కండక్టర్లకు ఇప్పటికీ పూర్తి అవగాహన లేకపోవడంతో పాత్రికేయులు ప్రయాణ సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. బుధవారం సాయంత్రం తిరుపతి నుంచి శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఏపీ 39 జడ్ 0261 నంబర్ గల ఆర్టీసీ బస్సులో ఓ పాత్రికేయుడు ఎక్కాడు. రేణిగుంట వరకు అంటూ.. తన జర్నలిస్ట్ పాసును మహిళా కండక్టర్‌కు చూపించాడు. దానిని చూసిన ఆమె..ఇది చిత్తూరు జిల్లా పాస్ అని, తిరుపతి జిల్లాలో టికెట్ తీసుకోవాల్సిందేనంటూ తేల్చి చెప్పారు. ఆర్టీసీ అధికారులు ఇచ్చిన బస్సు పాస్‌లో పూర్వపు చిత్తూరు జిల్లా అని స్పష్టంగా ఉందని జర్నలిస్ట్ ఎంత చెప్పినా ఆమె పట్టించుకోలేదు. చివరికి సందేహం ఉంటే అధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవాలని జర్నలిస్ట్ ఆమెకు సూచించినా.. మాకిదే పనా!? అంటూ ఆమె టికెట్ ఇవ్వబోయారు. ఇంతలో జర్నలిస్ట్ ఆర్టీసీ పీఓకు ఫోన్ చేసి సమస్యను ఆయన దృష్టికితీసుకెళ్లాడు. ఆ అధికారి సైతం స్పందించి ఫోన్లోనే ఆ మహిళా కండక్టర్‌తో మాట్లాడారు. 'పూర్వపు చిత్తూరు జిల్లా పాస్'పై ఆమె అవగాహన కల్పించడంతో చివరకు ఆమె తన స్వరం మార్చారు. ఇదలా ఉంచితే, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పూర్వపు చిత్తూరు, తిరుపతి జిల్లా పాసులపై కండక్టర్లకు ఆర్టీసీ ఉన్నతాధికారులు సరైన అవగాహన కల్పించాల్సి ఉంది.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు


జట్టు సభ్యులకు నగదు బహుమతిని అందజేస్తున్న ఉప సర్పంచ్ మహేంద్ర, వైఎస్సార్‌సీపీ నేత మాధవయ్య

వరదయ్యపాళెం : మండలంలోని చిన్న పాండూరు వడ్డిపాళెంలో సంక్రాంతి సందర్భంగా స్థానిక యువత క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్థానిక యువకులు ప్రవీణ్, రాకేష్, తేజ, గురునాథం ఆధ్వర్యంలో 2 రోజుల పాటు పోటీలు జరిగాయి. బుధవారం జరిగిన ఫైనల్ పోటీల్లో అదే గ్రామానికి చెందిన లోకనాథం జట్టు విజయం సాధించగా, రన్నర్స్‌గా పవన్ జట్టు నిలిచింది. విజయం సాధించిన జట్టుకు స్థానిక సర్పంచ్ శ్యామల సుబ్రమణ్యం , టీడీపీ నాయకుడు రుద్రయ్య, జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ తులసీరామ్ రూ.15 వేల నగదును ప్రథమ బహుమతిగా అందజేశారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన పవన్ జట్టుకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ దేవేళ్ల మహేంద్ర రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. అలాగే విజయం సాధించిన క్రీడాకారులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కొమిరి మాధవయ్య ట్రోఫీలను అందజేశారు. ఏర్పాట్లకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కార్తీక్, సుబ్బరాయులు నగదు, ఆర్థిక సాయం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గోపూజ


గోవులకు పూజ చేస్తున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలోని సప్త గోకులంలో కనుమ పండుగను పురస్కరించుకుని బుధవారం ఘనంగా గోపూజ నిర్వహించారు. ముందుగా గోవులను సుందరంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి ఆలయ అధికారులు , వేద పండితులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అయప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తీశ్వరస్వామి వార్ల గిరి ప్రదక్షిణ బుధవారం జరిగింది. ఈ నేపథ్యంలో భక్తులకు నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామి వెంకటేశ్వరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పళ్లికొండేశ్వర ఆలయంలో..

నాగలాపురం : మండలంలోని శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలోని గోశాల నందు గోవులను ముస్తాబు చేసి కనుమ పండుగను వైభవంగా నిర్వహించారు. అనంతరం గోశాల నందు బొమ్మరిల్లును ఏర్పాటు చేసి పొంగలి పెట్టి ప్రత్యేకంగా గోపూజ చేశారు.


అయ్యప స్వామికి పూజలు చేస్తున్న వేద పండితులు


గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు

సూర్యనారాయణ హోమం


ఏకం అధ్వర్యంలో నిర్వహించిన సూర్యనారాయణ హోమం


లోకా ఫౌండేషన్ కార్యాలయం వద్ద భక్తుల కోలాటం

వరదయ్యపాళెం : మండలంలోని అమ్మాభగవాన్‌లకు చెందిన ఏకం ఆధ్వర్యంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం వరదయ్యపాళెంలోని గోవర్ధనపురంలోని లోకా ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో సూర్యనారాయణ హోమం వైభవంగా నిర్వహించారు. మండల నలుమూలల నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కోలాటం, గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మరిల్లు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లోకా ఫౌండేషన్ ప్రతినిధులు ఆచార్య ఆనందగిరిజీ, లోకేష్, సునీల్, లక్ష్మీ దాసాజీ, బొప్పన రమేష్‌బాబు పాల్గొన్నారు.

పితృ తర్పణం..పోటెత్తిన జనం

-కిటకిటలాడిన కపిలతీర్థం

తిరుపతి కల్చరల్: పెద్దలను స్మరించుకునే మకర సంక్రాంతి నాడు తమ కుటుంబ పెద్దలకు పితృ తర్పణం కార్యక్రమం నిమిత్తం వచ్చిన వారితో మంగళవారం కపిలతీర్థం పోటెత్తింది. మూడు రోజుల సంక్రాంతి పర్వదినాలలో మకర సంక్రాంతి నాడు కుటుంబ పెద్దలకు పితృ తర్పణం, పిండ ప్రదానం చేసి స్మరించుకోవడం ఆనవాయితీ. ఇలా చేస్తే వంశాభివృద్ధి, గోత్ర అభివృద్ధి జరుగుతుందని ప్రజల నమ్మకం. మంగళవారం మకర సంక్రమణ పుణ్యకాలం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు, ఈ సమయంలో పితృ తర్పణం చేసేందుకు నగర ప్రజలే కాక చుట్టుపక్కల ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో రావడంతో ఎటుచూసినా కపిలతీర్థం కిటకిటలాడింది. పురోహితుల పర్యవేక్షణలో పితృదేవతలకు పిండ ప్రదానం చేయడంతో పాటు తర్పణ దానం చేశారు.

గుడ్లు తేలేయాల్సిందే..


జిల్లా శివారులోని సత్యవేడులో కోడిగుడ్లు ధరలు కొండెక్కాయి. పండుగలకు గుడ్లు ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు 'గుడ్లు' తేలేస్తున్నారు. నాణ్యమైన మాంసం లభించకపోవడంతో ఎక్కువ మంది కోడి గుడ్లు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- హోల్‌సేల్‌గా డజను కోడిగుడ్లు రూ.66
- రిటైల్‌లో రూ.72కు విక్రయాలు
- అమాంతం పెరిగిన డిమాండ్

సత్యవేడు : మార్కెట్‌లో ఒక కోడి గుడ్డు ధర హోల్‌సేల్‌గా అయితే రూ.5.50 ఉండగా రిటైల్ వ్యాపారులు రూ.6కు విక్రయిస్తున్నారు. మాంసం కిలో రూ.650 నుంచి 700 , బ్రాయిలర్ కోడి కిలో రూ.220, నాటు కోడి రూ.430 వరకు ఉంటోంది. చెరువు చేపలు కిలో కొర్రమీను రూ.420, చేపలు కిలో రూ.220 నుంచి రూ.330 వరకు ధర పలుకుతున్నాయి. దీంతో మాంసాహారమే కాదు, గుడ్డు కూడా కొనడం కష్టమేనని జనం వాపోతున్నారు. కోడి గుడ్లు చిత్తూరు, నెల్లూరు, చెన్నై ప్రాంతాల నుంచి సత్యవేడుకు సరఫరా చేస్తున్నారు. ప్రతి రోజు వాహనాల్లో జిల్లా శివార్లలోని సత్యవేడు వరకు సరఫరా అవుతాయి. ప్రతి రోజు మండలంలో 10 వేల గుడ్లు వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. వారం రోజుల కిందట డజను కోడి గుడ్ల ధర రూ.60 ఉండగా నేడు రూ.72కు చేరడంపై పేదలు ఆవేదన చెందుతున్నారు.

నాణ్యమైన మాంసం లభించక : నాణ్యమైన మేకపోతు, పొట్టేలు మాంసం లభ్యం కాకపోవడం, పశువైద్యులు ఆరోగ్యంగా ఉందని నిర్ధారణ చేసిన వాటినే కోయాలనే నిబంధన ఉంది. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. రోగాల బారీన పడినవి, చనిపోయినవి అక్కడక్కడా కోసి విక్రయిస్తున్నారు. వీటి భయంతో కొంత మంది ఏ తంటా లేకుండా గుడ్లు అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని వాటిపైనే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. పండుగ నేపథ్యంలో గుడ్ల ధరలు మరింత పెరగడంతో ఆందోళన చెందుతున్నారు.

చిల్లర నాణేలకు గిరాకీ

దుకాణంలో ఒకటి , రెండు కోడిగుడ్లు తీసుకొని దుకాణదారుల (వ్యాపారులు)కు రూ. 10 లేదా రూ.20 ఇస్తున్నారు . దీంతో ఒక గుడ్డు కొన్న వారికి రూ. 4, రెండు గుడ్లు కొన్నవారికి రూ. 8 చిల్లర ఇవ్వాల్సి వస్తోంది. దీంతో రూపాయి, రెండు, ఐదు, రూపాయ నాణేలకు డిమాండ్ పెరిగింది. తమిళనాడు నుంచి చిల్లర నాణేలు తెస్తున్నారు. వ్యాపారులకు రూ. 100కే రూ.95 వంతున చిల్లర ఇస్తున్నారు. చిల్లర దొరకడమే కష్టంగా ఉండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.